Ananth & Ananth Series



An Accomplished Author With World-Wide Releases Of Two Of His English Novels "The Enemy of the Mankind" and "The Dictator of the Dark"

## సూర్యదేవర రామ్ మోహన రావు



# నైట్

# నైట్

-సూర్యదేవర రామ్‌మోహనరావు

# నైట్

సతీష్ ఆ వీధిలోకి అడుగుపెట్టేసరికి...

సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలయింది.

వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

దూరంగా—

అవతల వీధుల్లో ఎక్కడో బీట్‌కానిస్టేబుల్ విజిల్స్ విన్పిస్తున్నాయి. వీధికుక్క ఒకటి సమీపంలో గొంతు చించుకు మొరుగుతోంది.

అంతక్రితమే—

ఓ జల్లు వర్షంపడి వెళ్ళింది.

వీధులు తడిపొడిగా వున్నాయి.

వీధి దీపాల కాంతి తనమీద పడకుండా...

సాధ్యమైనంతవరకు చీకట్లమాటున నడుస్తూ మరికొంత దూరం ముందుకెళ్ళాడు. ఒక చెట్టు చాటున నిలబడి దృష్టిని ఆ యింటి గేటు వైపు సారించాడు.

ఎత్తయిన గేటు ముందు...

ఇద్దరు గూర్ఖాలు అప్రమత్తంగా కాపలా కాస్తున్నారు.

లోన వేరే అరడనుమంది ఆ భవంతికి కాపలా వుంటారని తెలుసు. వాళ్ళంతా పచ్చినెత్తురు తాగే గూండాలు. కాని చూడ్డానికి తోటపని చేసే నౌఖర్లలా వుంటారు.

వారం రోజులుగా ఆ ఇంటిని తను—

నిశితంగా గమనించాకే తనకు అనువైన ఇల్లు అదేనని నిర్ణయించుకున్నాడు తను. తనకి లక్షరూపాయలు కావాలి. తనలాంటి మధ్యతరగి యువకుడికి, చిన్న ఉద్యోగస్తుడికి అంత డబ్బు ఎక్కడ్నుంచి వస్తుంది?

అలాగని చేతులు ముడుచుక్కూచునే తత్వంకాదు తనది.

తనకి డబ్బు అవసరం.

ఎలాగైనా సంపాదించాలి.

దొంగతనం చేసయినా సరే.

ఎప్పుడన్నా అవసరం వచ్చినప్పుడు చిన్న చిన్న దొంగతనాలు చేయటం తనకు మామూలే. ఈసారి చిల్లర పనులతో ప్రయోజనం లేదు. అందుకే కావలసిన ఇంటి కోసం ఆనుపాన్లు గమనిస్తూండగా తన దృష్టి ఆ భవంతి మీద పడింది.

రెండంతస్తుల అధునాతన భవంతి.

చూడ్డానికి ఇంద్రభవనంలా వుంది.

చూట్టూ విశాలమైన ఆవరణలో చక్కటి గార్డెన్ వుంది.

పటిష్టమైన కాపలా వుంది.

అంత బలంగా వుందంటే ఖచ్చితంగా లోన డబ్బు మూలుగుతూ వుంటుంది.

అందులోంచి తనకు కావలిసింది తీసుకోవాలని–

దొంగతనానికి పథకం ప్రకారం వచ్చాడు.

చిన్నగా ముందుకు కదిలాడు.

ఆ భవంతిని ఆనుకుని వున్నది మరో రెండంస్తుల భవనం.

ప్రస్తుతం అది ఖాళీగా వుంది.

గోడదూకి ఆ భవంతి ఆవరణలో అడుగుపెట్టాడు సతీష్.

గుండెలు దడదడలాడుతున్నాయి.

అయినా తప్పదు!

లక్ష రూపాయలు తనకి అవసరం. అంత డబ్బు సంపాదించాలంటే ప్రస్తుతం ఇంతకన్నా మరోదారి లేదు!

వాటర్ పైపు దగ్గర పదిసెకన్లు నిలబడ్డాడు. తనను ఎవరూ గమనించటంలేదని నిర్ధారించుకున్నాక ఉడతలా చకచకా పైపు వెంట పైకి ఎగబాకాడు. వానకి తడిసిన పైపు వెంట పైకి వెళ్ళటం కాస్త శ్రమతో కూడున్నా ఎలాగో మేనేజ్ చేసి భవంతి టెర్రస్ మీదకు చేరుకోగలిగాడు.

అక్కడి నుంచి దిగువకు చూశాడు.

తన అంచనా తప్పలేదు.

పక్క కాంపౌండ్‌లో అరడజను ఆకారాలు చీకట్లో చీకటిగా కలిసిపోతూ అప్రమత్తంగా కాపలా తిరుగుతున్నారు.

వాళ్ళు ఏమాత్రం పసిగట్టినా–

తనని నంచుకు తినేస్తారు. సందేహంలేదు!

భుజాన సంచిని కింద పెట్టాడు.

అందులోంచి ఒక నైలాన్ తాడు చుట్టని, ఒక ఇనపకొక్కాన్ని బయటతీశాడు. తాడుకి కొక్కాన్ని బలంగా బంధించాడు.

దిగువన ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక–

తాడును గిరగిరా తిప్పి అవతలి బిల్డింగ్ మీదకు విసిరాడు.

ఇనప కొక్కెం అవతలి మేడమీది పిట్టగోడకు తగులుకుని చప్పుడు చేసింది. చీమ చిటుక్కుమన్నా విన్పించే నిశీధిలో ఆ చప్పుడు బిగ్గరగానే విన్పించింది.

మరుక్షణం-

"ఏమిటది? ఆ చప్పుడేమిటి?" దిగువన ఎక్కడో ఒక సెంట్రీ గొంతు తుపాకి తూటా చప్పుడులా విన్పించింది.

"అదే అర్థంగావటం లేదు" మరో గొంతు.

"ఏదో పిల్లి దూకి వుంటుంది" మరొకడి మాట.

ఇంటి చుట్టూ తిరిగి చూశారు వాళ్ళంతా.

అనుమానించతగ్గ ఆధారం ఏదీ కన్పించలేదు.

ఇక ఆ విషయం పట్టించుకోకుండా వాళ్ళంతా బిల్డింగ్ ముందుకు పోర్టికోవైపు వెళ్ళిపోయారు.

కొద్దిగా చినకులు రాలటం కొంత సతీష్‌కి సహకరించింది. వాళ్ళు బయటకు రాకుండా పోర్టికోలోనే వుండిపోయారు.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు సతీష్.

నైలాన్ తాడును బిగించి కట్టేశాడు.

సంచి భుజాన తగిలించుకున్నాడు.

తడిపొడి చినుకులు పడుతూనే వున్నాయి.

చలిగాలి జివ్వున వీస్తోంది.

తాడు వెంబడి తల్లకిందులుగా వేలాడుతూ-

అవతలి బిల్డింగ్ వైపు జాగ్రత్తగా కదిలాడు.

ఏమాత్రం చేయి జారి కిందపడినా...

పులుసులోకి ఎముక మిగలదని తెలుసు.

సాహసం చేయాలి... తప్పదు.

అవసరం మనిషిని ఎంతకయినా తెగింపచేస్తుంది.

పదే పది సెకన్లలో-

తాడు వెంబడి అవతలికి చేరుకుని బిల్డింగ్ మీద నిలబడ్డాడు. దిగువన అలికిడి లేదు. వాళ్ళెవరూ బయటికొచ్చిన జాడ లేదు. ఇంతవరకు తన అదృష్టం బాగానే వుంది. ఇకమీదట ఎలా వుంటుందో చూడాలి.

చప్పుడు గాకుండా టెర్రస్ మీద నడుస్తూ-

స్టెయిర్‌కేస్ రూంని చేరుకున్నాడు.

డోర్ లాక్‌చేసి వుంది.

తన దగ్గరున్న పరికరాలతో-

చిటికెలో లాక్ తెరిచాడు.

డోర్ తీసుకుని మెట్లమీదకు అడుగుపెట్టాడు.

బెడ్‌లైట్ కాంతిలో....

ఆ ప్రదేశమంతా గుడ్డి వెలుగు పరుచుకుంది.

చిన్న టార్చిలైటును ఆన్‌చేసి దాని వెలుగులో మెట్లు దిగి, దిగువన కారిడార్‌లో అడుగుపెట్టాడు. ఓసారి చుట్టూ పరిశీలించాడు. అక్కడ ఎవరూ వున్న జాడలేదు. కాపలా కూడా లేదు.

ముందుకు అడుగులేశాడు.

✦ ✦ ✦ ✦ ✦

డబుల్‌కాట్ బెడ్ మీద–

ఒక అతిలోక సుందరి గాఢనిద్రలో వుంది.

సువిశాలమైన పాలరాతి గది.

ఎ.సి.సౌండ్ తప్ప నిశ్శబ్ధంగా వుంది.

ఎటుచూసినా ఖరీదైన అలంకార వస్తువులు, ఖరీదైన సోఫాసెట్లతో ఇంద్రభవనంలా వుంది గది. నీలంరంగు బెడ్‌లైటు గదిలో పల్చటి వెలుగు నింపుతోంది.

ఆ పరిస్థితిలో–

సడెన్‌గా మెలుకూ వచ్చింది ఆమెకు.

నిద్రమత్తుతో కళ్ళు మూతలు పడుతున్నాయి.

సొగసైన తన సోగకళ్ళ కనురెప్పల్ని చిన్నగా విప్పి చూసింది.

గది నిశ్శబ్ధంగా వుంది.

బయట వర్షం పడుతున్న శబ్ధం వినవస్తోంది.

బద్ధకంగా ఇటునుంచి అటు తిరగబోతూ ఆగిపోయింది.

తనకు ఎందుకు మెలుకూ వచ్చింది?

తనలో తనే ప్రశ్నించుకుంది.

తలతిప్పి ఓసారి గదంతా పరిశీలించింది.

అప్పుడు–

ఒక ఆకారం ఆమె కంటబడింది.

గది కార్నర్‌లోని బీరువా ముందు నిలబడి వున్నాడతను.

బీరువాలోని అరల్ని వెదుకులాడుతున్నాడు.

మొదట అతను తన మేనమామ బాలరాజు అనుకుంది.

కాదు అని వెంటనే గ్రహించింది.

ఆశ్చర్యంతో ఆమె కళ్ళు విశాలమయ్యాయి.

క్షణంలో నిద్రమత్తు ఎగిరిపోయింది.

అరనిమిషం పాటు–

అతన్నే పరికిస్తూ వుండిపోయింది.

ఎలా రాగలిగాడు?

కట్టుదిట్టమైన కాపలావున్న ఈ ఇంట్లోకి దొంగతనానికి రాగలిగాడంటే– ఇతనెవరో అసాధ్యుడిలా వున్నాడు.

మనిషి ఆరడుగుల ఎత్తున , చక్కటి రంగు, చూడచక్కని ముఖవర్ఛస్సుతో హీరోలా వున్నాడు చూడ్డానికి. అతను దొంగ అంటే నమ్మబుద్ధి కావటం లేదు.

అసలు....

అతను దొంగతనానికే వచ్చాడా? మరేదన్నా కారణమా? చిన్నగా లేచింది. చప్పుడుగాకుండా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి అతడి వెనక నిలబడింది.

అతను ఇవేమీ గమనించే స్థితిలో లేడు.

అతడి కళ్ళు ఆకలిగొన్న పులిలా డబ్బు కోసం వెదుకుతున్నాయి.

చప్పుడు రాకుండా జాగ్రత్తపడుతూ-

బీరువాలు, అల్మారాలు, డ్రాయరు సొరుగులు అన్నీ గాలిస్తున్నాడు. నీడలా అతని వెనకే అడుగులేస్తూ అతడి చర్యల్ని గమనిస్తోందామె. వస్తూన్న నవ్వుని బలవంతంగా ఆపుకుంటోంది.

అతను చాలా విసుగ్గా వున్నాడు.

ఇంత శ్రమపడి వస్తే-

ఆ గదిలో ఎక్కడా చిల్లిగవ్వకూడా లేదు.

చివరిగా-

కప్‌బోర్డ్ ఓపెన్ చేశాడు.

లోపల-

హ్యాంగర్లకు వేలాడుతూ డజన్లకొద్దీ బట్టలున్నాయి.

అన్నీ లేడీస్ డ్రెస్‌లే!

విసుగ్గా వెనుతిరగబోయాడు.

ఊహించని పరిణామం అది...

తన వెనకే ఆమె నిలబడిన సంగతి అతడికి తెలీదు.

అతడు వెనుదిరుగుతాడని ఆమె వూహించలేదు.

వెనుదిరుగుతూనే ఆమెని గుద్దుకున్నాడు.

ఆమె ఛాతీ ఎత్తులు అతడి ఛాతీని దారుణంగా గుద్దుకున్నాయి.

ఆ విసురుకు చెరోపక్కకు పడిపోయారు.

కెవ్వున అరవబోయి బలవంతంగా ఆపుకున్నాడతను.

"ష్..." అంటూ పెదవులమీద వేలుంచి అరవద్దని హెచ్చరించిందామె.

చటుక్కున జేబులోంచి డాగర్ తీశాడు సతీష్.

బటన్ నొక్కగానే-

'చక్'న బయటకు దూకింది ఆరంగుళాల బ్లేడ్.

వెంట్రుకనుసైతం రెండుగా చీల్చగల పదునుతో తళతళా మెరుస్తోందది.

దాన్ని చూసి గుటకలు మిగిందామె.

"ఏమిటి... నన్ను... నన్ను చంపేస్తావా?" భయంగా అడిగింది.

"అవును! అరిస్తే చంపేస్తాను" చిన్నగా అయినా కరుగ్గా హెచ్చరించాడు.

"అయితే అరవను" అంది నవ్వుతూ.

"నవ్వుతావే..? నేనంటే భయంలేదా...?" ఉడుక్కుంటూ దబాయించాడు.

బాసిపట్టువేసి కూచుందామె.

వంటిమీద చక్కటి డిజైన్‌తోకూడిన నైటీ వుంది.

ఆమె వంటినుంచి వస్తున్న సెంటు వాసన మనసుకు జోలపాడుతున్నట్టుంది. అప్పుడు గమనించాడామెని- ఆమె సాధారణ యువతికాదు, చాలా అందమైన అమ్మాయిని!

"నన్ను చూసి భయపడి కిందపడ్డావ్. నువ్వంటే నాకెందుకు భయం?" అంది వెక్కిరింతగా.

"సర్లే... ఇక్కడేం చేస్తున్నావ్? నాలాగే దొంగతానికి వచ్చావా?" అడిగాడు.

"నేనా... దొంగతనమా... నా గదిలోకొచ్చి నన్నే దొంగని చేస్తున్నావా? నీ ధైర్యానికి చెప్పాలి" అంది నవ్వేస్తూ.

"ఓ... ఈ ఇంటి యజమాని కూతురివా?" అన్నాడు.

"యజమాని కూడా నేనే..."

"అలాగా! ఛత్తేరి... ఇంత గొప్పగా ఇల్లు కట్టుకున్నావ్. ఈడ్చితంతే ఎక్కడా ఒక్క రూపాయి కనబడలేదు. నీ మొగుడు ఏం చేస్తాడేమిటి?"

"ఏయ్... నీ పేరేమిటి?" కోపంగా అడిగింది.

"ఎందుకు పోలీసులకి పట్టివ్వాలనా?"

"పట్టివ్వనుగాని పేరు చెప్పు."

"అంత తెలివితక్కువవాడిని కాదులే! ప్రస్తుతానికి దొంగగారూ అని పిలు. అదిచాలు!"

"ఓకే! చూడండి దొంగగారూ! నేనెవరో మీకు తెలీదా?"

"తెలీదు."

"నా ముఖం ఎక్కడా చూసిన గుర్తులేదా?"

"బాగుంది! కనీసం నా కల్లోకూడా ఎప్పుడూ నువ్వు రాలేదు. ఇక నీ గురించి నాకెలా తెలుస్తుంది?"

"ఓహో... నా గురించి తెలీకుండానే దొంగతనానికొచ్చావా?"

"అవును. కాపలా బలంగా వుందికదా! డబ్బు బాగా దొరుకుతుందని వచ్చాను. డబ్బుకు బదులు నువ్వు దొరికావ్?"

"అయితే నన్ను ఎత్తుకుపోతావా?"

"ఏమిటీ... నిన్ను.... వేళాకోళం వద్దుగాని వదులే. నా దారిన పోతాను."

"ఏం చేయను. టైం బాగలేదు!"

"ఇదిగో దొంగగారూ! నిన్ను చూస్తూ మంచివాడిలా వున్నావు. ముందా కత్తి మడిచి జేబులోపెట్టు. మనం చాలా మాట్లాడుకోవాలి."

"నీతో నాకు మాటలేమిటి? నైస్‌గా మాటల్లోకి దించి నన్ను పట్టివ్వాలనా? చెప్పాగా... నేనసలే మంచివాడిని కాదు. నిజంగానే చంపేస్తాను" అంటూ డాగర్‌ని కళ్ళముందు ఆడించాడు.

క్షణకాలం అతడ్నే చూస్తూండిపోయింది.

"నిజం చెప్పు! నువ్వు దొంగవేనా?" అడిగింది.

"దొంగని కాదని చెబితే నమ్ముతావా?"

"నువ్వు నిజం చెబితే సాయం చేస్తాను"

"హలో... ఈ ప్రపంచంలో దొంగాడికి సాయం చేస్తానన్న మనిషిని నిన్నే చూస్తున్నాను. ఇలా మాయచేసి నీ మొగుడినో, బాబునో పిలిచి పట్టిచ్చేద్దామనా? ఆ పప్పులేం నా దగ్గర ఉడకవుగాని, వెళ్ళి హాయిగా నిద్రపో. నా దారిన వెళ్ళిపోతాను" అంటూ లేవబోయాడు.

చటుక్కున అతడి చేయి పట్టుకుని లాగి కూచోబెట్టింది.

పట్టులా మృదువుగా వున్న ఆమె చేతి స్పర్శకి–

అతడి శరీరం పులకరించింది.

ఆమె కోపంగా చూసింది.

"ఏమిటి! పోతాను పోతానని తొందర...? అంత భయపడేవాడివి ఎందుకొచ్చావ్? నన్ను చూస్తే నీకు

పెళ్ళయిన అమ్మాయిలా కనబడుతున్నానా?" దబాయించింది.

"నీకు పెళ్ళికాలేదా?"

"లేదు."

"అయితే త్వరగా నీకు పెళ్ళి జరగాలని ఆశీర్వదిస్తాను. నన్ను వదిలెయ్."

"వదిలేస్తా! నీ పేరేమిటో చెప్పు? నీకు డబ్బు అవసరం ఏమిటో చెప్పు?

"చెబితే సాయం చేస్తావా?"

"తప్పకుండా."

"నా పేరు సతీష్."

"వెరీగుడ్! పేరు చాలా బాగుంది. నువ్వూ బాగున్నావ్."

"నా తలరాత బాగాలేదు!"

"ఎందుకట?"

"ఏముంది– ఈ లోకంలో నాకు మా అమ్మ, ఆమెకు నేను తప్ప మాకు నా అనేవాళ్ళు ఎవరూ లేరు. ఈ మధ్యనే మా అమ్మకి వంట్లో బాగాలేదు. ఆస్పత్రికి తీసుకెళ్ళి చూపించాను. అదేదో జబ్బు అన్నారు. నెల రోజుల్లోపల ఆపరేషన్ చేయకపోతే బ్రతకదన్నారు. అమ్మకన్నా ఈ లోకంలో నాకు ఏదీ ఎక్కువకాదు. కానీ– లక్ష రూపాయలు ఎక్కడ తేగలను. అందుకే... అమ్మను రక్షించుకోడానికి దొంగతనానికి వచ్చాను."

"సో... నీ దొంగతనం వెనక ఓ లక్ష్యం వుందన్నమాట. తల్లికి మించిన ధనం ఈ లోకంలో ఏదీలేదు. వెంటనే ఆపరేషన్ చేయించి మీ అమ్మను కాపాడుకో."

"అయితే డబ్బిస్తావా?"

"ప్రస్తుతం నా దగ్గర లేదు. అది ఉన్న చోటు చూపిస్తాను. కావలసినంత పట్టుకెళ్ళు!"

"అయితే చూపించు."

"చూపిస్తా. నే చెప్పినట్టు వింటే!"

"చెప్పు! ఏం చేయాలి?"

"భోంచేసావా?"

లేదన్నట్టు తల వూపాడు.

"నాతోరా" అతడి చేయి పట్టుకు లేపింది.

అతడ్ని సోఫాలో కూచుండజేసింది.

ఎదురుగా టీపాయ్ మీద ట్రేలో–

చక్కగా మూతలుపెట్టి వున్నాయి భోజన పదార్థాలు.

మూతలు తీసింది.

రైస్‌తోపాటు చికెన్ ఫ్రై, ఎగ్స్, సాంబారు, కూరలు...

ఆశ్చర్యంతో తలమునకలైపోతూ చూసాడతను.

"ఏమిటిది... నేను వస్తానని తెలిసే భోజనం రెడీగా వుంచావా?" అడిగాడు నమ్మలేనట్టు.

అందంగా నవ్వింది.

"అదేంకాదు! ఈపూట నేను భోంచేయలేదు. అందుకే ఇవన్నీ అలాగే వుండిపోయాయి" అంది.

"ఎందుకు చేయలేదు?"

“ఎందుకంటే... నాదో విచిత్రమైన జీవితం. నామీద నాకే విరక్తి పుడుతూ వుంటుంది. మనసుకు బాధ కలిగినప్పుడు ఇలా భోజనం మానేస్తూంటాను.”

“ఇప్పుడు భోంచెయ్యి.”

“వద్దు! ఆకల్లేదు. నువ్వు తిను.”

“నీ పేరు?”

“నా పేరు నిజంగా నీకు తెలీదా?”

“నిజంగా తెలీదు.”

“నా పేరు చందమామ.”

“చందమామ కథలు చెప్పక! నేను పసివాడ్ని కాదు.”

“ఎంతవరకు చదువుకున్నావ్?”

“ఎమ్.కాం.”

“బాప్‌రే!” నిర్ఘాంతపోయిందామె.

“ఏమిటి! సర్టిఫికెట్స్ చూపిస్తేగాని నమ్మవా?” భోంచేస్తూనే అడిగాడు.

“అదికాదు! ఇంత చదువుకొని... ఇలా దొంగతనం ఏమిటి? నీకు ఉద్యోగం లేదా?”

పేలవంగా నవ్వాడు.

“వచ్చింది! ఓ ప్రైవేట్ కంపెనీలో చిన్న క్లర్క్ ఉద్యోగం. నెలకి వెయ్యి రూపాయలు జీతం. చూడండి మేడమ్! ఈ రోజుల్లో చదువు ఒక్కటే చాలదు. లంచం యివ్వగలగాలి. లేదా మంచి రికమెండేషన్ వుండాలి. నాకు రెండూ లేవు.”

ఆమె మౌనంగా వుండిపోయింది.

“ఇంతకీ నీ పేరు చెప్పలేదు?” అడిగాడు.

“నా పేరు ప్రియ.”

“బాగుంది.”

“ఏం బాగుంది?”

“అదే... నీ పేరు. నీ అందానికి తగ్గ పేరు.”

ముచ్చటగా అతన్నే చూస్తూండిపోయింది.

అతను భోజనం ముగించాడు.

సింక్‌లో చేయి కడుక్కుని వచ్చాడు.

“అన్నదాతా సుఖీభవ అన్నారు. వచ్చింది దొంగతనానికయినా ఇంత చక్కటి భోజనం పెట్టి ఆకలి తీర్చావు. నువ్వు కలకాలం సుఖసంతోషాలతో వుండాలి” అన్నాడు.

“ఆశీర్వాదమా... సంతోషించాంలే!”

“నేనూ సంతోషిస్తున్నా. ఈ భుక్తాయాసానికి ఇక్కడే పడి నిద్రపోవాలనుంది.”

“నిద్రపో...! జైలుకు పోవాలని సరదాగా వుంటే.”

“అమ్మో వద్దులే. ఆ డబ్బు ఎక్కడుందో చూపిస్తే త్వరగా దోచుకుపోతా.”

“నాతోరా!”

ఆమెను అనుసరించాడు.

ఇద్దరూ గదిలోంచి బయటికొచ్చారు.

కారిడార్‌లో ఒక డోర్ ముందు ఆగిందామె.

అది లాక్ చేసి వుంది.

"ఈ డోర్ తెరు. చప్పుడు గాకూడదు" చెప్పింది.

రెండే రెండు నిమిషాల్లో లాక్ ఓపెన్ చేశాడు.

ఇద్దరూ లోనకు వెళ్ళారు.

గది కార్నర్‌లో ఒక ఐరన్ సేఫ్ వుంది.

దాన్ని చూపించిందామె.

"తెరవగలవా?" అడిగింది.

తలూపాడు.

అయిదే అయిదు నిమిషాలు–

లాక్ ఓపెనయింది.

లోనకు చూడగానే కళ్ళు జిగేల్‌మన్నాయి.

కట్టలుకట్టలుగా కరెన్సీ.

అనేక బంగారు అభరణాలు.

"ఏమిటీ? మొత్తమంతా వూడ్చుకుపోతావా?" అతడి ఫీలింగ్స్ గమనిస్తూ కొంటెగా అడిగింది.

చిన్నగా నవ్వాడు.

"అంత స్వార్థం నాకు లేదు. ఒక లక్ష యివ్వు. చాలు!" అన్నాడు.

"తీసుకో."

"నువ్వే యివ్వు" అంటూ భుజాన సంచిని ఆమెకిచ్చాడు.

లోపల్నుంచి కొన్ని కరెన్సీ కట్టలు తీసి–

అతడి బ్యాగ్‌లో వేసింది.

"ఎంత వేసావ్?" అడిగాడు.

"రెండు లక్షలు" చెప్పింది.

"అదేమిటి! లక్ష చాలన్నాగా."

"లక్ష మీ అమ్మగారి ఆపరేషన్‌కి. ఇంకో లక్ష నువ్వు దొంగతనాలు మానేసి బుద్ధిగా బ్రతకటానికి. కమాన్! ఎప్పటిలా సేఫ్‌కి లాక్ వేసెయ్యి."

సేఫ్ మూసి ఎప్పటిలా లాక్ చేసాడు.

వేలిముద్రలు లేకుండా తుడిచేశాడు.

ఇద్దరూ బయటికొచ్చారు.

గది డోర్‌ని కూడా యధాప్రకారం మూస లాక్ చేశాడు.

"థాంక్స్ ప్రియా! నీ ఉపకారాన్ని మర్చిపోలేను" అన్నాడు.

"మర్చిపోవద్దు! ఎందుకంటే భవిష్యత్తులో నువ్వు కూడా ఏదో ఒక ఉపకారం నాకు చెయ్యాలిగదా!"

"నీకు ఉపకారం చేయగల గొప్పవాడ్ని కాదు నేను"

"అలా చెప్పి తప్పించుకోవాలనా?"

"లేదు లేదు. నిజంగా ఆ పరిస్థితే వస్తే నీ కోసం నా ప్రాణమైనా యిస్తాను."

"ఓకే! నీ అడ్రసివ్వు?"

"దేనికి? నీనిలా వెళ్ళగానే అలా నా వెంట పోలీసుల్ని తరమటానికా?"

"ఛత్!" అంటూ నవ్వేసింది.

"మరీ నన్ను ఫూల్‌ని చేసి మాట్లాడ్డం బాగాలేదు. నీ చదువుకి చక్కటి ఉద్యోగం వస్తుంది. ఆ ఉద్యోగం నేనిప్పిస్తాను. నాకు తెలిసిన బ్యాంకు వాళ్ళతో మాట్లాడి నీ అడ్రస్ యిస్తాను. వాళ్ళు పిలవగానే వెళ్ళి కనబడితే చాలు!"

సతీష్ ముఖంలో వెలుగురేఖను...

ఆమె స్పష్టంగా గమనించింది.

"సందేహంలేదు. ఈ రోజు నేను నక్కను తొక్కి దొంగతానానికి వచ్చాను. లేకుంటే నీ దర్శనభాగ్యం ఏమిటి? ఇన్ని వరలేమిటి? తట్టుకోలేకపోతున్నాను" అన్నాడు.

"పొగడనక్కర్లేదుగాని అడ్రస్ యిస్తున్నావా లేదా?" అడిగింది.

చిన్న చీటీమీద అడ్రస్ రాసిచ్చాడు.

"ఓకే! నేను వెళతాను" చెప్పాడు.

"నీకు అనుకూలమయిన ఫోన్ నెంబర్ ఏదన్నా వుందా?" అడిగింది.

"ఉంది. నేను పనిచేస్తున్న షాపులో ఫోన్ వుంది" చెప్పాడు.

"నంబరు రాసివ్వు."

అడ్రస్ చీటీమీద నెంబరు కూడా వేసిచ్చాడు.

"ఓకే! ఒక బయల్దేరు" అంది.

తనతోపాటు ఆమె కూడా వస్తుంటే వారించాడు.

"బయట వాన పడుతోంది" అన్నాడు.

"ఫరవాలేదు" అంది.

ఇద్దరూ టెర్రస్‌మీదకు వచ్చారు.

"ఎలాగూ వచ్చావ్ కాబట్టి చిన్న సాయం చెయ్యి" అడిగాడు.

"చెప్పు- ఏమిటది?"

"ఏంలేదు! ఈ తాడు పట్టుకుని ఆ బిల్డింగ్ మీదకు వెళ్ళిపోతాను. నేను అక్కడికి చేరగానే ఈ ఇనుపకొక్కెం లాగి తాడును వదిలెయ్. నేను దీన్ని తీసుకుని వెళ్ళిపోతాను. ఎవరికీ అనుమానం రాదు."

"ఓకే! జాగ్రత్తగా వెళ్ళు."

"థాంక్స్ ప్రియా! నీ మేలు మర్చిపోలేను"

"మర్చిపోవద్దు" అంది నవ్వుతూ.

ఇద్దరూ వానలో తడుస్తున్నారు.

తాడు పట్టుకున్నాడు.

తల్లకిందులుగా వేలాడుతూ అవతలి బిల్డింగ్ మీదకు చేరుకున్నాడు.

అతడు చేయి వూపగానే-

నైలాన్ తాడు ఇనకకొక్కెం లాగి వదిలేసింది.

దాన్ని తీసుకుని అవతలి బిల్డింగ్ మీదకు చేరుకున్నాడు.

దాన్ని చుట్టి సంచిలో వేసుకున్నాడు.

తర్వాత వాటర్‌పైప్ వెంట నేలకు జారిపోయాడు.

అతడు చీకట్లలో కలిసిపోయేవరకు–

మేడమీద వానలో నిలబడి చూస్తూనే వుంది ప్రియ.

అతడు కనుమరుగు కాగానే–

వెనుతిరిగింది.

✦ ✦ ✦ ✦ ✦

"ప్రియా బేబీ... ప్రియమ్మా... అరెరెరె... ఇంకా నిద్రపోతూనే వున్నావా? అప్పుడే తొమ్మిది కావస్తోంది టైము. లేలేలే!"

మేనమామ బాలరాజు గొంతు వింటూనే–

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది ప్రియ.

అప్పటికే–

బెడ్‌కి సమీపంలోకి వస్తూ కన్పించాడతను.

సుమారు యాభై సంవత్సరాల వయస్సు–

అయిదున్నరడుగుల ఎత్తున పోతపోసిన విగ్రహంలాంటి చామనఛాయ. దృఢ శరీరం, కాస్త చింపిరిజుత్తు, పిచ్చిగడ్డంతో చూడడానికి అమాయకుడిలా కన్పించే బాలరాజును చూస్తే ప్రియకు ఒళ్ళంతా తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్టుంటుంది.

వాడు ఒక మేకవన్నె పులి.

తేనే పూసిన కత్తి.

తనపాలిట శాపం వాడు.

ఎప్పుడూ సూటు ధరించి తిరగటం అతని అలవాటు.

నాలుగు జాన పొడవుండే నల్లటి పొన్నుకర్ర విలాసంగి చేతిలో ఎప్పుడూ వుండాల్సిందే. ఆ కర్రలో కత్తి వున్న సంగతి బయట ప్రపంచానికి తెలీకపోవచ్చు. కాని ప్రియకు తెలిసిన రహస్యం.

చిన్నగా లేచి కూచుంది.

రాత్రి సతీష్ భోంచేసిన తాలూకు ప్లేట్‌లు, డిష్‌లు అన్నీ పనిమనిషి పొద్దుటే తీసేసి క్లీన్ చేసింది.

"రాత్రి లేటుగా భోంచేసావా?" సూటిగా చూస్తూ అడిగాడు.

"ఊఁ...!" అంది.

అంతకుమించి ఎక్కువగా–

అతడితో మాట్లాడటం ఆమె ఇష్టపడదు.

అతనంటే నిలువునా ద్వేషం.

"ఏమిటి తల్లీ యిది? టైెంకు భోంచేయాలని తెలీదా? ఇలా అయితే నీ ఆరోగ్యం ఏం కావాలి?" అన్నాడు ఎంతో ప్రేమతో.

ఆమె బదులు చెప్పలేదు.

తలపంకించాడు.

"ఈ రోజు డాన్స్ రిహార్సలున్నాయి. ఓ గంటలో బయలుదేరాలి. త్వరగా రెడీకా" అంటూ లేచాడు.

"ఈ రోజు రిహార్సల్స్‌కి రాలేను. ఒంట్లో బాగాలేదు" అంది గోళ్ళు గిల్లుకుంటూ.

"రావాలి. తప్పదు!" సీరియస్‌గా చెప్పాడు.

"తప్పదు... ఎందుకంటే– ఎల్లుండు నీ డాన్స్ ప్రోగ్రాం వుంది."

వినకూడని మాట ఏదో విన్నట్టు–

చివ్వున తలెత్తి చూసిందామె.

"ఎల్లుండా....?" అంది నమ్మలేనట్టు.

"అవును... ఎల్లుండే."

"ఈ నెల్లో ఒక ప్రోగ్రాంలు ఒప్పుకోవద్దని చెప్పాను."

"డబ్బు వస్తుంటే ఒప్పుకోకుండా ఎలా వుండమంటావ్? బంగారు గుడ్డుపెట్టే బాతువి నువ్వు. బంగారం వద్దనటానికి నేనేమన్నా మూర్ఖుడినా? నువ్వంటే పడిచస్తున్నారు జనం. నీ ఆట, పాటలకి వెర్రెక్కిపోతున్నారు కుర్రాళ్ళు. డబ్బు... డబ్బు... డబ్బు... నువ్వు గజ్జెకడితే కరెన్సీ వర్షం కురుస్తుంది."

"మామయ్యా! నీకు కావలసింది డబ్బు. సంపాదించి యిచ్చానుగా? ఇంకా ఎందుకు నన్ను పీడిస్తావ్? నా జీవితంతో ఎందుకు ఆడుకుంటావ్? నేను డాన్స్ చేయను. ఇంకెప్పుడూ కాలికి గజ్జెకట్టను."

"కట్టవా?"

"కట్టను."

"నా మాటకే ఎదురు చెప్తావా? నిన్ను చంపేస్తాను!" అంటూ ఈడ్చి చెంపమీద కొట్టాడు.

కెవ్వున అరిచింది.

సుకుమారమైన ఆమె చెంప బూరెలా పొంగింది.

బోర్లాపడి ఏడుస్తూండిపోయింది.

"నన్ను రాక్షసుడిగా మార్చకు. అర్థమైందా? నేను చెప్పినట్లు చేయటమే నీ పని. కేవలం ఆటబొమ్మవి, ఆడుతూనే వుండాలి. ఆడనని నువ్వు మొరాయించిన రోజు... ఏమవుతుందో చెప్పానుగా. ఇంతవరకూ నీ నాట్యంతో వ్యాపారం చేశాను. ఇకమీదట నీ శరీరంతో వ్యాపారం చేయవలసి వస్తుంది. జాగ్రత్త!" హెచ్చరించాడు.

"అంతకన్నా ఒకేసారి నన్ను చంపేయ్‌రాదు. పీడ విరగడవుతుంది. ఈ బాధ నేను భరించలేను" అంది ఏడుస్తూ.

పగలబడి నవ్వాడు బలరాజు.

"బాధపడుతున్నావా? ఎందుకు? ఎందుకే పిచ్చిదానా? నీ నాట్యం చూసి వెర్రెక్కిన కుర్రాళ్ళు బాధతో ఉరేసుకు చావాలి నాలాంటి అప్సరస అందదని తెలిసి. నీకేం బాధ? హాయిగా ఆడుతూ పాడుతూ కాలక్షేపం చేస్తే ఏ బాధా వుండదు.

నాకు తెలుసు. ఈ కళారంగం, ఈ నాట్యం ఇవేమీ నీకు ఇష్టం లేదని నాకు తెలుసు. నీకు పెళ్ళి మీదికి గాలి మళ్ళింది. చక్కగా ఓ కుర్రాడిని చూసుకుని పెళ్ళిచేసుకుని సంసారంలో సెటిలయిపోవాలని చాలా ఆశపడుతున్నావ్. అదే జరిగితే ఇక నా పరిస్థితి ఏమిటి చెప్పు?

అసలు లిటిగేషనంతా నీ పెళ్ళితోనే వుంది మరి! నీ బాబు పోతూ పోతూ ఆస్థి మొత్తం నీకు రాసిపారేసి నన్ను గార్డియన్‌ని చేశాడు. నీకు పెళ్ళికాగానే నేను ఆస్థి నీకు వప్పగించి తప్పుకోవాలన్నాడు. తప్పుకుంటాను. నీకు పెళ్ళి చేస్తాను. మరి నా భవిష్యత్తుకు కావలసినంత సంపాదించుకోవాలి గదా! ఇప్పుడు నువ్వు చేస్తోంది అదే.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Night**

* * *